క్లుప్తంగా

## 'వైఎస్సార్ బీమా' అందజేత


మృతుడి భార్యకు నగదు అందిస్తున్న అధికారులు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె దళితవాడకు చెందిన పరదేశి చెంగ్రాయుడు సోమవారం అనారోగ్యంతో మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం పాతసంగటిపల్లె డీడీఓ లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్‌లు తక్షణ సాయం కింద వైఎస్సార్ బీమా ద్వారా రూ.10 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేత్రదానం


రామసుబ్బమ్మ (ఫైల్)

పులివెందుల రూరల్ : పట్టణంలోని సరస్వతి వీధికి చెందిన పెద్దారెడ్డి రామసుబ్బమ్మ (78) మంగళవారం రాత్రి మరణించారు. దీంతో ఆమె కుమారులు బ్రహ్మానందరెడ్డి, శ్రీరామరెడ్డి, కుమార్తెలు హేమలత, లక్ష్మీదేవి, అరుణతోపాటు కుటుంబ సభ్యులు.. నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. దీంతో ఆయన టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి నివాసానికి చేరుకుని మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు.

## అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి

సింహాద్రిపురం : అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని పులివెందుల పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. రోడ్ల అధునికీకరణ, డ్రైనేజీ కాలువలు, నూతన ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐ బాధ్యతలు స్వీకరణ


విష్ణునారాయణ

పులివెందుల : పులివెందుల పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా విష్ణునారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు అర్బన్ పోలీస్‌స్టేషన్ సత్యనారాయణను వీఆర్‌కు పంపడంతో.. స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న విష్ణునారాయణను పులివెందుల ఎస్‌ఐ–2గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

## ఆధ్యాత్మిక భావం పెంచుకోవాలి


నేతాజీనగర్ కాలనీలో పుస్తక పఠనం చేస్తున్న హాఫీజ్ మస్తాన్

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంచుకోవాలని పీఠాధిపతులైన సయ్యద్‌షా సాదిక్ పాషా ఖాద్రీ, సయ్యద్‌షా తాహీర్ పీరాఖాద్రీ, హాఫీజ్ మస్తాన్ తెలిపారు. ఈ నెల 16న దస్తగిరి నెల ప్రారంభం నుంచి పట్టణంలో దస్తగిరిస్వామి జీవిత చరిత్ర పఠనం ప్రారంభించారు. దస్తగిరిస్వామి పుట్టుక, మహిమలు, స్వామి చూపిన సన్మార్గంలో నడవాలంటూ పీఠాధిపతులు ప్రతి రోజూ వివరించారు. గురువారం సాయంత్రం పుస్తక పఠనం చివరి ఘట్టం పూర్తి చేసిన తర్వాత దస్తగిరి స్వామి జెండా పండుగను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## నవంబర్ 4న కడపలో సదస్సు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మోదీప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబరు 4న జిల్లా సదస్సు జరగనుంది. దీనిని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయు జిల్లా కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా నవంబర్ 26, 27, 28 తేదీలలో విజయవాడ రాజభవన్ వద్ద జరిగే మహాధర్నాలను జయప్రదం చేయాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు పంటలకు సమగ్ర ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50% కలిపి చట్టబద్ధ మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెంచి పంట రుణాలు అందించాలని, కేరళ తరహాలో రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటులో చేయాలన్నారు.

# పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం


చింతకొమ్మదిన్నె : వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


పెద్దముడియం : జగనన్న ఆరోగ్య సురక్షపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం 18వ డివిజన్ పరిధిలోని విశ్వనాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష ఏర్పాట్లను పరిశీలించి, ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు ఎలా ఉన్నాయ్ అంటూ ప్రజలను అడిగి వారికి మందుల కిట్లు అందజేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌ను సందర్శించి ప్రజలతో మట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి వారికి తగిన మందులు ఇవ్వాల్సిందిగా అధికారులకు తెలియజేశారు. అలాగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటే హాస్పిటల్‌కు రెఫర్ చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా**

పెద్దముడియం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్షతో పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాలూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. వైద్యం ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామ స్థాయిలోనే అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందజేయడం పట్ల రోగులు ఎమ్మెల్యే ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చవ్వా క్రిష్టారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సాంబశివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గ్యాస్ శివారెడ్డి, మండల స్థాయి అధికారులు, వైద్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**ప్రజలకు శ్రీరామ రక్ష**

సింహాద్రిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష లాంటిదని స్టేట్ హార్టికల్చర్ మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సుహాసిని తెలిపారు. కసనూరు సచివాలయ పరిధిలోని కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ స్టాల్స్‌ను పరిశీలించి సంపూర్ణ పోషణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ఈఓఆర్డీ పద్మనాభరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్యం**


సింహాద్రిపురం : ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మస్తాన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, క్రిష్టారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బ్రహ్మంరెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, వైద్యులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం

పులివెందుల రూరల్ : పులివెందులలో అనారోగ్యంతో బాధ పడుతున్న పాత్రికేయుడు ప్రసాద్‌రెడ్డికి సహచరులు ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.30 వేలను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## మొబైల్ ఆధార్ కేంద్రాల ఏర్పాటు

వల్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీన మండల పరిధిలోని అంబవరం గ్రామ పంచాయతీ కార్యాలయం, 27న పైడికాలువలోని గ్రామ సచివాలయం, 28న లేబాకలోని గ్రామ సచివాలయంలో మొబైల్ ఆధార్ కేంద్రాల ద్వారా సేవలు అందించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

## కూలీలకు భూ పంపిణీ చేయాలి

కమలాపురం : భూములు లేని వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.బాషా కోరారు. బుధవారం 3వ వార్డు సచివాలయ అడ్మిన్ ప్రణీత్‌రెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద కుటుంబాలకు నెలకు రూ.10 వేల కరువు పెన్షన్ ఇవ్వడంతోపాటు 35 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించాలన్నారు. అలాగే పేద విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి బ్రహ్మం పాల్గొన్నారు.

# ఇంటింటికీ సంక్షేమ పథకాలు


జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పెద్ద కొండప్ప కాలనీ సచివాలయం పరిధిలోని పార్నపల్లిరోడ్డు, పెద్దకొండప్పకాలనీ తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరికి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును ఆయన వివరించారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిలకు మద్దతు తెలపాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వెంటనే అధికారుల ద్వారా పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లి కిశోర్, కౌన్సిలర్లు గుల్జార్, శ్యామలాదేవి, కోడి రమణ, సిద్దయ్య, డేనియల్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓతూరు రసూల్, వీరారెడ్డి, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్నామని సీపీఐ నాయకుడు శివనారాయణ తెలిపారు. స్థానిక పాతబస్టాండ్‌లో ఉన్న ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహం వద్ద బుధవారం ప్రజా రక్షణ భేరి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి పేరుతో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోకి వచ్చే నెల 1వ తేదీన ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. బద్వేలు, మైదుకూరు, కడప ప్రాంతాల్లో యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, కిరణ్, రాజేంద్ర, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత మందులు అమ్మితే చర్యలు


పురుగు నివారణ మందులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వేంపల్లె : నిషేధిత కలుపు నివారణ మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు జిల్లా భూ సంరక్షణ విభాగపు సహాయ వ్యవసాయ సంచాలకులతో కలిసి ఆయన వేంపల్లెలో ఉన్న అన్ని పురుగు నివారణ మందులు, విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దుకాణాల్లో డూప్లికేట్ బయో పెస్టిసైడ్స్, బయోఫెర్టిలైజర్స్, రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. రైతులు కొనుగోలు చేసిన తర్వాత విధిగా బిల్లును తీసుకోవాలన్నారు. షాపు యజమానులు స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. దుకాణాల ముందు ధరల పట్టికను ప్రదర్శించాలని, లేనిపక్షంలో లైసెన్స్‌లను రద్దు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రాజేంద్రప్రసాద్, నవంత్ బాబు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, వీఏవోలు తదితరులు పాల్గొన్నారు.

# పంట కోత ప్రయోగాలు శాస్త్రీయంగా నిర్వహించాలి

బద్వేలు అర్బన్ : పంట కోత ప్రయోగాలు శాస్త్రీయంగా నిర్వహించాలని, తద్వారా దిగుబడి అంచనా వేయడం సాధ్యమవుతుందని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు మద్రిపాటి నాగరాజ పేర్కొన్నారు. బుధవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం అనంతరాజుపురం రైతుభరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రకాల రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం సమీపంలోని పొలాల్లో వరి సాగు చేసిన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్, సోషల్ ఆడిట్ సక్రమంగా నిర్వహించాలని రైతుభరోసా సహాయకులకు సూచించారు. అలాగే రబీ పంటల సాగు ప్రణాళికపై రైతులతో చర్చించారు. అనంతరం రైతుభరోసా చానల్ ప్రాముఖ్యతను వివరించి రైతులకు సభ్యత్వం చేయించారు.

# కనుల పండువగా గ్రామోత్సవం

వేంపల్లె : వేంపల్లెలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి పూలతొట్టిలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేంపల్లె వీధుల్లో మొబైల్ ఆర్కెస్ట్రా, కీలుగుర్రాలు, తప్పెట్లు, గుంతకల్ బ్యాండ్, బాణాసంచాలు తదితర ప్రత్యేక కార్యక్రమాలు ప్రదర్శించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర, నాయకులు, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి కళ్యాణ మండపం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన


శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి గ్రామోత్సవం

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : జిల్లాలోని బీడి కార్మికులు చదువుకునే తమ పిల్లల ఉపకార వేతనాల కోసం 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని కమలాపురం బీడి కార్మిక సంక్షేమ ఆసుపత్రి వైద్యాధికారి ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులు నవంబర్ 30వ తేదీలోపు, అలాగే ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు డిసెంబర్ 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు గతేడాదికి సంబంధించిన మార్కుల జాబితా, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం, బీడి కార్మిక సంక్షేమ సంఘం జారీ చేసిన కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో స్కాలర్‌షిప్స్.జీఓవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

## బుడ్డాయపల్లెలో చోరీ

కడప అర్బన్ : కడప నగరం రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుడ్డాయపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న అంజిరెడ్డి అనే వ్యక్తి ఇంటి తాళం పగలకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అతను గత శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం కడపకు రాగానే ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువాలో ఉన్న సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలను దోచి కెళ్లినట్లు అంజిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు ఈ సంఘటనపై రిమ్స్ పీఎస్ ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వేంపల్లె : మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వేంపల్లె సీఐ ఎస్.కె.చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మట్కా నిర్వహిస్తున్న ఆరుగురిని ఎస్‌ఐ తిరుపాల్ నాయక్, సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.50,400లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

**నాటుసారా స్వాధీనం**

పులివెందుల – కడప బైపాస్ రోడ్డులోని కుప్పాలపల్లి క్రాస్ రోడ్డు వద్ద నాటుసారా విక్రయించేందుకు తీసుకువెళ్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. స్థానిక రెడ్డయ్య కాలనీకి చెందిన కట్టెల శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసారాను స్వాధీనపరుచుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

**నిందితులకు రిమాండ్**

స్థానిక పుల్లయ్యతోటలో గొడవ పడిన కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చాంద్‌బాషా వెల్లడించారు. ఇరగదెండ్ల వీరాంజనేయులు, బత్తల పరమేష్‌లు స్థల వివాదంపై గొడవ పడడంతో, వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

# వసతి గృహంలో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప అర్బన్ : ప్రభుత్వ బాలుర గృహంలో పిల్లలకు సౌకర్యాలను కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, జడ్జి ఎస్.కవిత అన్నారు. బుధవారం జడ్జి కవిత, సిబ్బందితో కలిసి ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సందర్శించారు. పిల్లలకు అందుతున్న వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలను, వసతి గదులను రిజిస్టర్‌లను పరిశీలించారు. పిల్లల పట్ల ఎప్పటికపుడు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. జువైనల్ జస్టిస్ చట్టం, న్యాయసహాయం, రక్షణ సలహా వ్యవస్థ (ఎల్‌ఏడీసీఎస్) ఉచిత న్యాయ సహాయం వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ వైద్యాధికారి, పిల్లలు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో దాదాపు 60 మంది ఉపాధ్యాయులకు పొసిషన్ ఐడీ రాక టెక్నికల్ సమస్యతో మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్సీ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా నాయకులు రాముడు, మధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవం.. పుష్పయాగం


అమ్మవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

**ముగిసిన దసరా ఉత్సవాలు**

కడప కల్చరల్ : శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. తొమ్మిదిరోజులపాటు నగరంలోని అమ్మవార్ల ఆలయాల్లో రోజుకో అలంకారం చొప్పున ఉత్సవ మూర్తులను భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. ప్రధానమైన రోజుల్లో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. దుర్గాష్టమి, విజయదశమితో ప్రధాన కార్యక్రమాలు పూర్తి కాగా, మంగళ, బుధ వారాల్లో పవళింపుసేవ, పుష్పయాగం నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బెస్తవేముల రామమహేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మునగా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పవళింపు సేవ, పుష్పయాగం నిర్వహించారు. భక్తులందరూ తమకు తోచిన పూలు, సుగంధ పత్రాలను అమ్మవారికి సమర్పించారు. ఎలిశెట్టి శివకుమార్ ప్రత్యేకంగా బెంగళూరు నుంచి 75 రకాల పుష్పాలను తెప్పించారు. 450 కిలోల పుష్పాలు, 200 కిలోల మరువం, దవనం లాంటి పరిమళ పత్రాలను అమ్మవారికి సమర్పించారు. అర్చక బృందం వాటిని అమ్మవారికి క్రమ పద్ధతిలో అమర్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నిరకాల దోషాల పరిహారం కోసం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పుష్పయాగాన్ని భక్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నడివీధి గంగమ్మ క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేకంగా ఊయల ఏర్పాటు చేసి సర్వాలంకార భూషితురాలైన అమ్మవారికి పవళింపు సేవ నిర్వహించారు. స్థానిక మహిళా భక్తులు భక్తి గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం ఉత్సవ కమిటీ నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతులు రెండు వేల మందికి అమ్మవారి పేరిట అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.


పూలను తీసుకొస్తున్న భక్తులు

# సామాజిక విప్లవకారుడు సీఎం వైఎస్ జగన్


మాట్లాడుతున్న బాదుల్లా

కడప రూరల్ : సామాజిక విప్లవకారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెండ్ ఆర్గనైజేషన్ (ఎంబీసీడీఓ) రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా అన్నారు. బుధవారం సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తమ సంఘం తరపున సంపూర్ణ మద్దతును తెలిపారు. అనంతరం బాదుల్లా మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో సామాజిక విప్లవం తీసుకొచ్చారని అన్నారు. 2019 కేబినెట్‌లో 25 మంత్రి పదవులకు 14 మంత్రి పదవులు, నలుగురికి ఉప ముఖ్యమంత్రి పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించారన్నారు. అలాగే బీసీ వర్గాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్, డైరెక్టర్‌లను నియమించారని తెలిపారు. దేశ చరిత్రలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారన్నారు. ఈ నేపథ్యంలో 26వ తేదీ నుంచి చేపడుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు తాము సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అన్ని వర్గాల వారు ఈ యాత్రను విజయవంతం చేయాలన్నారు.